క్లుప్తంగా

అధికారుల విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని రామచంద్రునిపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకున్న ఘటనపై ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, జీసీడీఓ మంగతాయారు, తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ అశోక్‌లు వేరువేరుగా గురువారం విచారణ చేపట్టారు. ఆశ్రమ పాఠశాలలో చోటు చేసుకున్న ఘటనలకు సంబంధించి ఆశ్రమ పాఠశాలలోని ఓ విద్యార్థిని సెల్ఫీ వీడియో ద్వారా వాట్సప్ గ్రూప్‌లో హల్‌చల్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పాఠశాల హెచ్‌ఎంను, ఆ విద్యార్థినిని విచారణ చేసి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గిరిజన, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. విచారణ వివరాలను బహిర్గతం చేయాలని, తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

108లో ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

అశ్వారావుపేటరూరల్: పురిటి నొప్పులతో బాధ పడుతున్న ఓ గర్భిణిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో 108 అంబులెన్స్‌లో ప్రసవించిన ఘటన బుధవారం అర్ధరాత్రి సమయంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని దురదపాడు గ్రామానికి చెందిన కుర్సం కనకదుర్గ నిండు గర్భిణి కాగా.. అర్ధరాత్రి వేళలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనానికి ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న స్థానిక 108 వాహన సిబ్బంది ఈఎంటీ దీప్తి, పైలెట్ హరీష్ దురదపాడు వెళ్లి, గర్భిణిని అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలోని సున్నంబట్టి సమీపంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే ప్రసవం చేశారు. దీంతో తల్లీ బిడ్డ క్షేమంగా ఉండగా, ఆ తర్వాత ఆస్పత్రిలో చేర్పించారు.

పాఠశాల గదులు ప్రారంభం

మణుగూరుటౌన్: మండలంలోని కట్టుమల్లారం గ్రామంలో రూ.15లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు గదులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గురువారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, తక్షణమే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఐటీడీఏ డీఈ మధుకర్, ఏఈ ప్రసాద్, ఎంపీఓ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ముందస్తు బడిబాట

దమ్మపేట: మండలంలోని లింగాలపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, అదే గ్రామంలో ముందస్తుగా గురువారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. లింగాలపల్లి యూపీఎస్ హెచ్‌ఎం నరింహారావు ఆధ్వర్యంలో పాఠశాల సిబ్బంది ఆ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ.. ఐదు సంవత్సరాల పైన వయస్సు ఉండి పాఠశాలకు వెళ్లని పిల్లలను గుర్తించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఆ పిల్లల తల్లితండ్రులతో నేరుగా మాట్లాడి, వారిని పాఠశాలకు పంపాల్సిన అవశ్యకతను తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న వసతులను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీఎస్ఎస్‌సీ, ప్రసాద్, హీరాలాల్, మారుతి రామకృష్ణ, జారే వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువ పాసేజ్ పిల్లర్ కూలిన ఘటనలో బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పోతిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పిల్లర్ కూలీన ప్రదేశాన్ని పార్టీ జిల్లా నాయకులు గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్, పువ్వాల వినయ్, గంధం ప్రసాద్ గౌడ్, మాధారపు లక్ష్మణ్, మాలోతు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో..

సీపీఎం ఆధ్వర్యంలో గురువారం కూలిపోయిన పాసేజ్ పిల్లర్ పరిశీలించారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్ట్ అభాసుపాలౌతోందని పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు విమర్శించారు. పార్టీ రాష్ట్రకమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు తదితరులు ఉన్నారు.

గ్యారంటీలు అమలు చేయాలి

దుమ్ముగూడెం: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పావులూరిపేట గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు ఆరు గ్యారంటీల్లో కేవలం 200 యూనిట్ల ఉచిత కరెంట్ తప్పా ఏది అమలు కావడం వారి దృష్టికి రావడంతో ఆయన పై విధంగా స్పందించారు. సర్వేలో సీపీఎం మండల కమిటీ సభ్యులు సరియం ప్రసాద్, శాఖ కార్యదర్శి ముడివి అర్జున్, సొసైటీ డైరెక్టర్ ఉబ్బా భద్రయ్య, రాజులు, సరియం సీతారామయ్య, రాజ్ కుమార్, వెంకటస్వామి, రాజు, ఉబ్బా భద్రమ్మ, లక్ష్మి, ఈశ్వరమ్మ, వెంకటమ్మ, చిలకమ్మ, చంటి పాల్గొన్నారు.

వడివడిగా ఇందిరమ్మ ఇళ్లు

- చాపరాలపల్లి జీపీలో మొదలైన నిర్మాణాలు
- బెండాలపాడులో వేగవంతంగా కట్టడాలు
- చొరవచూపిన ఎమ్మెల్యే జారే



చాపరాలపల్లిలో బేస్‌మెంట్ లెవెల్ పూర్తయిన ఓ లబ్ధిదారుడి ఇల్లు

ములకలపల్లి: చాపరాలపల్లి గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ములకలపల్లి మండలంలో ఈ జీపీని పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేయగా.. 65 మంది లబ్ధిదారులను గుర్తించారు. వీరిలో 62మందికి ఇళ్లు మంజూరుకాగా, మరో ముగ్గురి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, మార్చి 7వ తేదీన చాపరాలపల్లిలో జీపీలోని కుమ్మరిపాడు గ్రామంలో లబ్ధిదారుడు పద్దం సునిత శ్రీను ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేసి, లాంఛనంగా పనులు ప్రారంభించారు. జీపీ కార్యదర్శి కృష్ణకాంత్, హౌసింగ్ ఏఈ రాము సంయుక్త పర్యవేక్షణలో లబ్ధిదారులు డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలను ఆరంభించారు. 62 మందికిగాను 34 మంది ఇళ్ల నిర్మాణాలు మొదలయ్యాయి. వీరిలో 8 మంది లబ్ధిదారులు బేసెమెంట్ లెవల్ పూర్తిచేసి, మట్టి పోశారు. మరో 17 మంది బేస్‌మెంట్ పూర్తి చేశారు. మట్టి తోలకాలు చేయాల్సి ఉంది. మిగతా వాటికి ముగ్గుపోశారు. వివిధ దశల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వేధిస్తున్న 'వాస్తు' సమస్య

ఇళ్ల నిర్మాణాలకు వాస్తు సమస్యగా మారింది. ఇంటింటి సర్వే చేపట్టిన సందర్భంలో ఏ భూమి వద్ద ఫొటో దిగారో, అదే ప్రదేశంలో ఇల్లు నిర్మిస్తేనే 'యాప్'లో అప్‌లోడ్ చేసే అవకాశం ఉంది. మరో చోట ఇంటి నిర్మాణం చేపడితే యాప్ తీసుకోవడం లేదు.

ఈ క్రమంలో ఇంటి పెద్ద పైభాగంలో, తమ్ముడు దిగువ భాగంలో ఇటు కట్టేందుకు స్థలం సరిపోకపోవడండో సుమారు ఐదుగురు లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం ఆరంభం కాలేదని తెలిసింది. ఈ విషయమై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి, స్థల మినహాయింపు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. తద్వారా మిగిలిన ఇళ్లు కూడా ప్రారంభమవుతాయి.

నాలుగు విడతల్లో చెల్లింపులు ఇలా..	
బేస్‌మెంట్ లెవెల్	రూ.లక్ష
రూఫ్ లెవెల్(విత్ బ్రిక్స్)	రూ.1.25 లక్షలు
ఆర్‌సీసీ శ్లాబ్	రూ.1.75 లక్షలు
ఫినిషింగ్	రూ.లక్ష

ఆదర్శ గ్రామంలో ఇళ్ల జాతర



బెండాలపాడులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం..

చంద్రుగొండ: మండలంలోని ఆదర్శగ్రామం, మారుమూల ఆదివాసీ గ్రామం బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల జాతర నెలకొంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయంలో నిర్మించిన ఇళ్లు మినహాయిస్తే పేదలకు దాదాపు పదిహేనేళ్లుగా పక్కా ఇళ్లు దక్కలేదనే చెప్పాలి. ప్రస్తుతం ఈ పంచాయతీలో తొలి, మలి విడతల్లో మొత్తం 303 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. దీంతో ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతంగా సాగుతున్నాయి. ఇళ్లు కట్టుకోలేని పేదలుంటే వారికి తనే స్వయంగా ఇళ్ల నిర్మాణాలు చేయిస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ భరోసా ఇస్తున్నారు. దీంతో తమ సొంత ఇంటి కల నెరవేరబోతుందని ఆదివాసీలు సంబరపడుతున్నారు.

దత్తత గ్రామానికి ఇళ్లు దక్కేనా?

మరోవైపు, మరో మారుమూల గ్రామమైన మహ్మద్‌నగర్‌ను ఎమ్మెల్యే జారే దత్తత తీసుకున్నారు. ఈ గ్రామానికి ఎమ్మెల్యే ఇప్పటివరకు రూ.1.85 కోట్ల నిధులు మంజూరు చేయించి, ప్రతివీధికీ సీసీరోడ్డు, సైడ్‌డ్రెయిన్ల నిర్మాణాలు కోసం వెచ్చిస్తున్నారు. పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. దీంతో గ్రామవీధులు కళకళలాడుతున్నాయి. అయితే ఇక్కడ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైతే గ్రామం మరింత శోభను సంతరించుకుంటుందని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

కల నెరవేరబోతోంది..



మా సొంతింటి కల నెరవేరబోతుంది. గ్రామంలో చాలామంది పేదోళ్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మా ఇల్లు ఎప్పుడు పూర్తి అవుతుందోనని ఆశగా ఉంది.

– కణితి వెంకటేష్, బెండాలపాడు

నమ్మలేక పోతున్నా..

మేం రేకుల షెడ్డులో ఉండే వాళ్లం. మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. పనులు ప్రారంభించాం. మాకు పక్కా ఇల్లు మంజూరైన విషయం నమ్మలేక పోతున్నాం. ఆనందంగా ఉంది.

– కారం శైలజ, బెండాలపాడు

ఆనందంగా ఉంది



ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం ఆనందంగా ఉంది. ఇప్పటికే బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేశాం. తొలివిడత బిల్లు కోసం ఎదురు చూస్తున్నాం.

– అమరేసి శ్రీధర్, చాపరాలపల్లి

నిరంతర పర్యవేక్షణ



ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రభుత్వ నియమ, నిబంధనలు పాటించి, నిర్మించుకునేలా అవగాహన కల్పిస్తున్నాం.

– రాము, హౌసింగ్ ఏఈ

వంద శాతం పూర్తి చేస్తాం



వంద శాతం నిర్మాణాలు ఆరంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. త్వరితగతిన పూర్తిచేసేలా లబ్ధిదారులను చైతన్యపరుస్తున్నాం.

– కృష్ణకాంత్, పంచాయతీ కార్యదర్శి

'ఇందిరమ్మ నమూనా గృహం' సిద్ధం



అశ్వారావుపేటలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ నమూనా గృహం

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకం'అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించగా.. కొన్ని పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఒకొక్క ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల రూపాయాలను కేటాయించగా, ఆయా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో విడతల వారిగా నగదు జమ చేయనున్నది. తొలి విడతగా మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు ఇప్పటికే నిర్మాణాల పనులను చేపట్టుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా గృహాలను నిర్మిస్తోంది. దీంట్లో భాగంగా అశ్వారావుపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నమూనా గృహం నిర్మిస్తున్నారు. ఈ భవన నిర్మాణం పూర్తి కాగా రంగులు వేసి ముస్తాబు చేశారు. అదే విధంగా నియోజకవర్గంలోని దమ్మపేట మండల కేంద్రంలో కూడా సిద్ధం కాగా.. ములకలపల్లిలో, చంద్రుగొండ మండలాల్లో శ్లాబ్ లెవల్ నిర్మాణాలు జరగాయి. అన్నపురెడ్డిపల్లి మండలంలో మాత్రం ఇంకా పునాది స్థాయిలోనే ఉంది. నిర్మాణాలు పూర్తయితే ప్రారంభానికి సిద్ధంగా ఉన్న అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లోని నమూనా గృహాలను త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

పాఠశాలల్లో ఆర్‌ఓ ప్లాంట్ల ఏర్పాటు



జగన్నాథపురం పాఠశాలలో ఎమ్మెల్యే జారేను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ములకలపల్లి: ఎమ్మెల్యే నిధులు 2.75 కోట్లతో అన్ని స్కూళ్లలో ఆర్‌ఓ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, రానున్న వార్షిక విద్యాసంవత్సరంలోగా అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హామీ ఇచ్చారు. ఇందిరమ్మ బడిబాట పేరిట మండలకేంద్రం, విజయపురికాలనీతోటు, 15 ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరిట రూ 1.52 కోట్లతో 57 స్కూళ్లలో తాత్కాలిక మరమ్మతులు, అత్యవసర పనులు చేసినట్లు వివరించారు. కాగా, బడిబాట కార్యక్రమంలో భాగంగా పర్యటిస్తూ.. నల్లముడి గ్రామానికి చెందిన పుచ్చకాయల వాసు ఇంట్లో ఎమ్మెల్యే సన్నబియ్యంతో భోజనం చేశారు. జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ గద్దె రేవతి, ఎంఈఓ సత్యనారాయణ, ఏఈలు సుబ్బరాజు, సురేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచ్‌లు కారం సుధీర్, సున్నం సుధాకర్, కీసరి శ్రీను, గాడి తరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే అగ్ని ప్రమాదాల నివారణ



భద్రాచలంఅర్బన్: మంటలు ఆర్పే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

భద్రాచలంఅర్బన్: అవగాహన ఉంటే అగ్ని ప్రమాదాల నివారణ చేపట్టవచ్చని భద్రాచలం అగ్ని మాపక శాఖ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణ వారోత్సవాల సందర్భంగా గురువారం పట్టణంలోని ఆయుషి నర్సింగ్ హోమ్ అనే ప్రైవేట్ ఆస్పత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలను వైద్య సిబ్బందికి వివరించారు. మంటలు వస్తున్న సిలిండర్‌ను ప్రయోగాత్మకంగా ఆస్పత్రి సిబ్బందితో ఆర్పివేయించారు. విద్యుత్ షార్టు సర్క్యూట్ వల్ల జరిగే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

వ్యాస రచన పోటీలు..

అశ్వారావుపేటరూరల్: అగ్ని మాపకశాఖ వారోత్సవాల్లో భాగంగా గురువారం అశ్వారావుపేటలోని జవహర్ విద్యాలయంలోని విద్యార్థులకు 'అగ్ని ప్రమాదాలు–నివారణ చర్యలు'అనే అంశంపై పోటీలను నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు త్వరలోనే బహుమతులు అందిస్తామని అగ్నిమాపక శాఖ అధికారి సైదులు తెలిపారు. అనంతరం వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద అగ్ని మాపక శాఖ సిబ్బంది రోగులకు, ఆస్పత్రి సిబ్బందికు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో జవహర్ విద్యాలయం ప్రిన్సిపాల్ ఇనుగంటి మైథిలి, ప్రవీణ్, ఆస్పత్రి వైద్యులు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలల తనిఖీ



సత్యనారాయణపురంలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న డాక్టర్ చైతన్య

చర్ల: మండలంలోని చర్ల, సత్యనారాయణనపురం ప్రభుత్వ వైద్యశాలలను గురువారం డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్యశాలలోని స్టాక్ రిజిస్టర్లు, ల్యాబ్‌రిజిస్టర్లు, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించడంతో పాటు రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి రోగులను నేరుగా అడిగి తెలుసుకున్నారు. నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారులకు ఆయన సూచించారు. నర్సింగ్ ఆఫీసర్ డాక్టర్ హారిక, ల్యాబ్ టెక్నీషియన్ గోపి, ఫార్మాసిస్టు నర్సింహారావు ఉన్నారు.

లబ్ధిదారుల ఇంట సన్నబియ్యంతో భోజనం



భద్రాచలంటౌన్: లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేస్తున్న వీరయ్య

భద్రాచలంటౌన్: జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య పట్టణం ఎంపీ కాలనీలోని లబ్ధిదారుడు కొండా సతీష్ ఇంట్లో గురువారం సన్నబియ్యంతో భోజనం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలుతో కలిసి సహపంక్తి భోజనంలో కూర్చున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడి కుటుంబాన్ని సన్నబియ్యం ఎలా ఉన్నాయంటూ వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ములకలపల్లి: బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ.. ఈ క్రమంలో నల్లముడి గ్రామానికి చెందిన పుచ్చకాయల వాసు ఇంట్లో ఎమ్మెల్యే సన్నబియ్యంతో భోజనం చేశారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ హెమోఫిలియా దినోత్సవం

మణుగూరురూరల్: మండలంలోని అన్ని ఆరోగ్య ఆయుష్మాన్ మందిర్, ఆరోగ్య ఉపకేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం-మణుగూరు ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ హెమోఫిలియా(రక్తస్రావం రుగ్మత) దినోత్సవాన్ని నిర్వహించారు. హెమోఫిలియాపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ నిశాంత్‌రావు, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసానికి 2 వేల దరఖాస్తులు

అశ్వాపురం: మండలంలో రాజీవ్ యువ వికాసం పథకానికి సుమారు రెండు వేల దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ వరప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఎస్టీ విభాగానికి 811, ఎస్సీకి 463, ఈబీసీ 72, మైనార్టీ 79, బీసీ విభాగం ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవలేదని సుమారు 600 ఉంటాయని మొత్తం రెండు వేల దరఖాస్తులు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ చేసిన వారు జిరాక్స్ పత్రాలు రెండు సెట్లు మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

నోట్ పుస్తకాల పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం మండల పరిధిలోని పాఠశాలలకు ఐటీసీ సారపాక వారు అందజేసిన నోట్ పుస్తకాలను ఎమ్ఈఓ టి.రమ గురువారం ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలోని 3 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ప్రతి ఒక్కరికీ రెండు చొప్పున నోటు పుస్తకాలను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చంగల్ రావు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణను ఓర్వలేకే అక్రమ కేసులు

అశ్వాపురం: రాహుల్‌గాంధీకి దేశ వ్యాప్తంగా వస్తున్న ఆదరణ ఓర్వలేక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయనపై అక్రమ కేసులకు తెరలేపుతోందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్‌బాబు, తూము వీరరాఘవులు, ఆవుల రవి, బచ్చు వెంకటరమణ, సామకూరి వెంకన్న, బారాజు సంపత్, హర్ష, శశికాంత్, నరసింహారావు పాల్గొన్నారు.

పాలాభిషేకం

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు గురువారం పాలాభిషేకం చేశారు. గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల తొలివిడత బిల్లులు రూ.లక్ష విడుదల కావడంతో సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, ఫజల్ బక్ష్ దారం గోవిందరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఐసీడీఎస్ పోషణ్ పక్వాడా



అశ్వారావుపేటరూరల్: చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్, టీచర్లు

మణుగూరురూరల్: మణుగూరు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూపర్‌వైజర్ సుశీల గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి చిన్నారులతో అన్నప్రాసన చేశారు. అనంతరం వివిధ రకాల వంటకాలను, పోషకాహార ప్రదర్శన నిర్వహించి, పోషకాహార ఆవిశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

'హ్యాండ్ వాష్'పై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని ఆసుపాక సెక్టార్ వినాయకపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం గ్రామస్తులు, చిన్నారులకు హ్యాండ్ వాష్ గురించి అవగాహన కల్పించారు. అలాగే సెక్టార్ పరిధిలో ఉన్న గర్భిణులకు సాముహిక సీమంతాలు చేసి వాయనం అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఇమ్మడి పద్మావతి, కోఆర్డినేటర్ శ్రీకాంత్, అంగన్‌వాడీ టీచర్లు సత్యవతి, ప్రవీణ, కృష్ణ వేణి, శకుంతల, రుక్మిణి, సునీత, వెంకట రమణ, ఆయాలు పాల్గొన్నారు.

సీతారామ కాల్వలకు భూసేకరణ

చంద్రుగొండ: సీతారామ కాలువ ద్వారా గోదావరి జలాలను పంట పొలాలకు తరలించేందుకు పిల్ల కాలువల నిర్మాణానికి భూసేకరణ చేయనున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. మండలంలోని రావికంపాడు, గానుగపాడు, పోకలగూడెం, తుంగారం, దామరచర్ల పంచాయతీల్లో గురువారం ఆయన పర్యటించి రైతులతో సమావేశమయ్యారు. జిల్లాలోని 12 మండలాల్లో 3,500 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉందన్నారు. చంద్రుగొండ మండలంలోని 8 పంచాయతీల్లో 547 ఎకరాల 7 గుంటల భూమి సేకరించాలన్నారు. మార్కెట్ ధర కంట నాలుగు రెట్లు అధికంగా పరిహారం చెల్లిస్తామని వివరించారు. ఇరిగేషన్ డీఈ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సంధ్యారాణి, ఆర్ఐ అక్బర్, పంచాయతీల కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'ట్విన్నింగ్ స్కూల్ ప్రోగ్రామ్'

దుమ్ముగూడెం: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులను ట్విన్నింగ్ స్కూల్ ప్రోగ్రామ్‌లో భాగంగా గురువారం దగ్గరలోని ఉన్నత పాఠశాలలకు తీసుకుని వెళ్లారు. ఉన్నత పాఠశాలలోని ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా స్థలాలు, హెచ్‌యం గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా యంఇఓ సున్నం సమ్మయ్య మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం సాంస్కృతిక మార్పిడి, పరస్పర విద్య, జాతీయ నైపుణ్యాలు, జాతీయ సమైక్యత మొదలగు అంశాలపై విద్యార్థులకు అవగహన కల్పించడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఏవీ రామారావు, బెక్కంటి శ్రీనివాసరావు, నర్సింహారావు, ఏజే ప్రభాకర్, నాగలక్ష్మి, ప్రేమ్‌సాగర్, నాగేశ్వరరావు, హనుమంతరావు, సుజాత, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కూలీగా మాజీ ఎమ్మెల్యే రేగా!



కూలీ పని చేస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: ఈ నెల 27వ తేదీన వరంగల్ జిల్లాలో జరగబోయే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో ఆర్థిక అవసరాల నిమిత్తం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు గురువారం ఒక్క రోజు కూలి(హమాలి) పని చేసి రూ.500 సంపాదించారు. మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులను నియమించాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను నియమించాలని కోరుతూ ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఐటీడీఏ పీఓ రాహుల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ మాట్లాడుతూ.. దుమ్ముగూడెం మండలం రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమం పాఠశాలలో ఎస్టీ కేటగిరీలో కోయ, లంబాడా విద్యార్థులకు సమన్యాయంగా విద్యా బోధించాల్సిన ఉపాధ్యాయులు ఒక లంబాడ సామజవర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. హెచ్‌ఎం కోయ విద్యార్థులను హింసిస్తున్నాడని, తక్షణమే బదిలీ చేసి మహిళ హెచ్‌ఎంను నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోయం కామరాజు, వజ్జా జ్యోతిబాస్, బండారి కృష్ణ, గనిబోయిన ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ఎదుట అధ్వానంగా రహదారి



తుమ్మలచెరువులో పాఠశాల ఎదుట బురదమయంగా రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మొండికుంట–తుమ్మలచెరువు రహదారి బురదమయమై అధ్వానంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షానికి రహదారి బురదమయమై అడుగు తీసి అడుగు పెట్టలేకుండా ఉంది. పాఠశాల ఎదుటే బురదమయంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. జీపీ కార్యదర్శి, అధికారులు స్పందించి పాఠశాల ఎదుట రహదారి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.